# 'కా దే ది క థ క న ర్హం'

## కుక్కపిల్ల

చలి ఎముకలు కొరికేస్తుంటే పాడు పడిన యింటి అరుగుమీద, ఇంటి మీదే కాక వంటిమీదా ఏ కప్పులేని సింహాద్రి- పొట్టలోకి కాళ్ళుతప్ప పెట్టుకోడానికో ఏమి లేని సింహాద్రి కాళ్ళు ముడుచుకుని మూడంకెవేసి. చలితో జ్వరంతో వణుకుతూ మూలుగుతున్నాడు. అడుక్కోడానికో మట్టి మూకుడు, దాహం తీర్చుకోడానికో పాత డాల్డా డబ్బా. మానం కప్పుకోడానికి ఏ ధర్మాతుడో దయతల్చి యిచ్చిన చిరుగుల కాకి నిక్కరు. ఏ పెంటమీద నించో ఏరుకుని తెచ్చుకున్న చీలికలు వాలికలు అయిన తుంగచాప సింహాద్రి ఆస్తి! వాటితోపాటు ఏడాదిగా పేగులు తోడేస్తున్న దగ్గు, సాయంత్రం అయ్యేసరికి చలికుదుపుతో వచ్చే జ్వరం కూడా వున్నాయి.

కట్టుకున్న పెళ్ళాం-ముష్టెత్తయినా ముద్ద పెట్టలేని అసమర్థుడని మరో మంచి ముష్టివాడితో లేచిపోయింది- కన్న ఒక్క కొడుకు కళ్ళిప్ప కుండానే కన్నుమూశాక- అతనికి లోకంలో తోడునీడ, నేస్తం అని చెప్పుకోడానికి వున్నది, ఒకే ఒక కుక్కపిల్ల! ఏ ఊరకుక్కో కనిపారేస్తే తల్లి నించి తప్పడి ఏడుస్తున్న కళ్ళిప్పని కుక్కపిల్లని జాలిపడి దగ్గిరకి తీసి, తాను తాగే గంజి యింతపోసి, అడుక్కు తెచ్చుకున్న అన్నం ఓ ముద్దపడేసి, యింటింటికి ముష్టికి తిప్పి, పసి పాపలా గుండెల మీద పడుకోపెట్టుకుని కుక్కపిల్లని పెంచుకున్నాడు సింహాద్రి-

గత రెండుమూడు నెలలుగా, సింహాద్రి రోగం ముదిరి, ధర్మాసుపత్రి డాక్టర్లు నీగుండె చిల్లులు పడింది, మరి బతకవు పో.... రోజులు లెక్కపెట్టుకో పో అని చెప్పేశాక- యిల్లిల్లూ తిరిగే ఓపికలేక చెట్టుకింద గుడ్డపరుచుకుని పడుకుని ఏ ధర్మాత్ములో విసిరిన పైసలు నాలుగు కూడ తీసి ఏ టీ కొట్టువాడో దయతలిచి యిన్ని టీ నీళ్ళుపోస్తే, ఆ డబ్బులతో చిన్న రొట్టె కొనుక్కొని దాన్లో ముంచుకుని తింటూ చావుకోసం ఎదురుచూస్తూ చావలేక బతుకుతున్నాడు. తన బతుక్కే తికానాలేని సింహాద్రి కుక్కపిల్ల బతుక్కి హామి యివ్వలేకపోవడంతో- కుక్కపిల్ల తనబతుకు తెరువు తాను వెతుక్కుందీ మధ్య. చలికి మెలకువ వచ్చి వెచ్చదనం కోసం పక్కలో కుక్కపిల్లని దగ్గిరకు లాక్కోబోతే చేతికి అందలేదు. జ్వరం మగత లోంచి బలవంతంగా కళ్ళిప్పి చూసేసరికి కుక్కపిల్ల లేదు- దూరంగా ఆ అరుగు

మీద మరోమూల పడుకున్న ముష్టిరాములుగాడి పక్కలో దూరి వెచ్చగా పడుకున్న కుక్కపిల్లని చూసేసరికి సింహాద్రిగాడికి తిక్కరేగింది–

సింహాద్రి రోగం ముదిరి కదలలేని స్థితికి వచ్చిందగ్గిర నించి కక్కుపిల్లకి తిండి కరవయి తోటి ముష్టివాడు రాములుగాడి చుట్టూ తోకాడించుకుంటూ తిరిగి వాడు జాలిపడి పడేసే మెతుకులు తినడం మొదలుపెట్టింది కుక్కపిల్ల. సింహాద్రి మరి లాభంలేదని కుక్కపిల్లకి అర్థం అయిపోయింది. సింహాద్రి పిలిస్తే దగ్గిరకి రావడం మానేసింది. రాములుగాడి దగ్గిరచేరి పడుకోడం మొదలుపెట్టింది. "దొంగనంజా యింతప్పటినించి సాకాను, యిస్వాసం లేదేనీకు, నీయమ్మ.... రాయె...." బండ బూతులు తిడ్తూ సింహాద్రి తూలుకుంటూ లేచి కుక్కపిల్ల చెవులుపట్టుకు లాక్కొచ్చి అది కదలకుండా కావలించుకుని పడుకున్నాడు. కుక్కపిల్ల గింజుకుంటూ లేచి దూరంగా పోయి మిడుకు మిడుకు చూస్తూ గుర్రు గుర్రుమంది- "రంకు నంజా నాలుగురోజులు తిండెట్టకపోతే మరీడ్ని మరిగేవ్ గుడిసేటి నంజా-" సింహాద్రి కోపం పట్టలేక ఓ రాయితీసి విసిరాడు- కుక్కపిల్ల చెంగున గెంతి తప్పించుకుని "ఎంత కుక్కనైతే మాత్రం తిండెట్టకపోతే యిస్వాసం ఏమిటన్నట్టు" సింహాద్రిని నిరసనగా చూసి, నిర్లక్ష్యంగా రాములుగాడి పక్కలో దూరి పడుకుంది మళ్ళీ—

★

# అగ్గిపుల్ల

"అప్పా, అగ్గి రాజెట్టినావా- కాస్త అగ్గెట్టు" పిడక పట్టుకుని గుడిసెలోకి వచ్చింది రత్తాలు. అప్పాలేదు, అగ్గీలేదు- కాని, అగ్గిలాంటి సింహాద్రి- ఫాక్టరీ నుంచి వస్తూ సుక్కేసుకు వచ్చి నగం మత్తులో నులక మంచానికి అడ్డం పడి వున్నాడు.

సింహాద్రిని చూస్తే నిప్పుని చూసినట్టే రత్తాలుకి భయం- ఆడి సూపుసోకితే కాలి భస్మం అవుతుందని భయం- దగ్గిరకెడితే కాలుతుందని భయం- నిప్పుకి దూరంగా వుండాలనుకుంటుంది- సింహాద్రి అంటే సింహస్వప్నం రత్తికి. సుక్క లాంటి రత్తి ఎంత ప్రయత్నించినా తనకు దక్కకుండా పోతూందని సింహాద్రికి ఉడుకు-తాగుబోతు సచ్చినోడు, ముండల సుతాకోరు సింహాద్రిని చూస్తే వంటికి